# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 13-02-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రెండు రోజుల అమెరికా పర్యటన నిమిత్తం ఈరోజు తెల్లవారుజామున వాషింగ్టన్ డిసికి చేరుకున్నారు.

- ❖ ఆదాయపు పన్ను బిల్లు 2025ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈరోజు లోక్‌సభలో ప్రవేశపెట్టారు.

- ❖ పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఈరోజు ఉభయ సభలను మార్చి 10 వరకూ వాయిదావేశారు.

- ❖ వక్ఫ్ సవరణ బిల్లు 2024 పై జాయింట్ పార్లమెంటరీ కమిటీ నివేదికలో ఏ భాగాన్ని తొలగించలేదని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు స్పష్టం చేశారు.

- ❖ ప్రధానమంత్రి నరేంద్రమోదీ “మన్ కీ బాత్ మనసులోని మాట” కార్యక్రమం 119వ సంచిక ఈనెల 23న ప్రసారమవుతుంది.

=======================

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రెండు రోజుల అమెరికా పర్యటన నిమిత్తం ఈరోజు తెల్లవారుజామున వాషింగ్టన్ డి.సి.కి చేరుకున్నారు. అమెరికాలోని భారత రాయబారి వినయ్ మోహన్ క్వాత్రా, ఇతర అధికారులు విమానాశ్రయంలో ప్రధానమంత్రికి స్వాగతం పలికారు. వాషింగ్టన్ డిసిలో ఇరు దేశాల మధ్య నిఘా సహకారాన్ని బలోపేతం చేయడంపై అమెరికా జాతీయ నిఘా సంస్థ డైరెక్టర్ తులసి గబ్బార్డ్ ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో చర్చలు జరిపారు. పరస్పర ఆసక్తి ఉన్న ప్రాంతీయ, ప్రపంచ పరిణామాలపై ఈ సందర్భంగా వారు అభిప్రాయాలను పంచుకున్నారు. భారత్ - అమెరికా సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని నిర్మించడం కోసం అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్‌ను కలవడానికి ఎదురుచూస్తున్నానని సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు.

=======================

ఆదాయపు పన్ను బిల్లు 2025ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈరోజు లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రస్తుత ఆదాయపు పన్ను చట్టంతో పోలిస్తే నూతన చట్టంలో తక్కువ విభాగాలు అధ్యాయాలు ఉన్నాయని.. సామాన్య ప్రజలు సులభంగా అర్థం చేసుకునేలా దీనిని సరళీకరించామని చెప్పారు. పరిశీలన కోసం బిల్లును పార్లమెంటు సెలెక్ట్ కమిటీకి పంపాలని తదుపరి సమావేశాల మొదటి రోజున కమిటీ దానిపై ఒక నివేదికను సమర్పించాలని నిర్మలా సీతారామన్ ప్రతిపాదించారు. పన్నుల రూపంలో వస్తున్న మొత్తాన్ని జవాబుదారీతనంతో ప్రజల కోసమే ఖర్చు చేస్తున్నామని మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 42 సెకన్లు)

=======================

పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఈరోజు ఉభయ సభలు మార్చి 10వ తేదీ వరకూ వాయిదాపడ్డాయి. లోక్‌సభలో ఈరోజు స్పీకర్ ఓం బిర్లా మాట్లాడుతూ... మొదటి దశ బడ్జెట్ సమావేశాలు ఈరోజుతో ముగిశాయన్నారు. ఈ మొదటి దశ సమావేశాలు 112 శాతం ఉత్పాదకతను నమోదు చేశాయని అన్నారు. భారత రాష్ట్రపతి పార్లమెంటు ఉమ్మడి సమావేశంలో చేసిన ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై జరిగిన చర్చలో 177 మంది సభ్యులు 17 గంటలకు పైగా పాల్గొన్నారని ఆయన సభకు తెలియజేశారు. 2025-26 సాధారణ బడ్జెట్‌పై జరిగిన చర్చలో 170 మంది సభ్యులు పాల్గొన్నారని ఓం బిర్లా వెల్లడిస్తూ ....

(వాయిస్ 29 సెకన్లు)

=======================

దేశ వ్యాప్తంగా ఉన్న 19 కోట్లకు పైగా గ్రామీణ కుటుంబాల్లో ఇప్పటివరకూ 15.45 కోట్లకు పైగా గృహాలకు “జల్ జీవన్ మిషన్” కింద కుళాయి నీటి సరఫరా జరిగిందని ప్రభుత్వం తెలిపింది. లోక్‌సభలో ఈరోజు కేంద్ర జల శక్తి మంత్రి సిఆర్ పాటిల్ ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ... 2019లో “జల్ జీవన్ మిషన్” ప్రారంభమైన సమయంలో, కేవలం 3.23 కోట్ల గ్రామీణ కుటుంబాలకు మాత్రమే కుళాయి నీటి కనెక్షన్లు ఉండేవని పేర్కొన్నారు. అప్పటి నుండి ఈ కార్యక్రమం కింద దాదాపు 12.22 కోట్ల గ్రామీణ కుటుంబాలకు కుళాయి నీటి కనెక్షన్లు అందించబడ్డాయని ఆయన తెలియజేశారు.

విరామం

=======================

వక్ఫ్ సవరణ బిల్లు - 2024 పై జాయింట్ పార్లమెంటరీ కమిటీ నివేదికను రాజ్యసభలో ఈరోజు ప్రవేశపెట్టారు. ప్రతిపక్షాల నినాదాల మధ్య ఈ రోజు ఉదయం భారతీయ జనతా పార్టీ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మేధా విశ్రామ్ కులకర్ణి నివేదికను రాజ్య సభలో ప్రవేశపెట్టారు. కమిటీ సమావేశాల్లో విపక్ష సభ్యులు ప్రతిపాదించిన అంశాలను నివేదికలో చేర్చలేదని.. దీనిని ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యగా ప్రతిపక్ష పార్టీ నాయకులు మల్లిఖార్జున ఖర్గే అభివర్ణించారు. దీనికి పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రతిస్పందిస్తూ... నివేదికలోని ఏ భాగాన్నీ తొలగించలేదని స్పష్టం చేశారు. ఈ అంశంపై ప్రతిపక్షం సభను తప్పుదారి పట్టిస్తోందని వివరణ ఇస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

=======================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 119వ సంచిక ఈనెల 23వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 21వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

=======================

“పరీక్షా పే చర్చా 2025” కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఒత్తిడికి గురవకుండా పరీక్షలకు ఎలా సన్నద్ధమవ్వాలానే విషయాలపై పేరు పేరు రంగాలకు చెందిన నిపుణులు పలు సూచనలు చేస్తున్నారు. అందులో భాగంగా ఈరోజు పరీక్షల సమయంలో సాంకేతికను ఎలా వినియోగించుకోవాలని అనే అంశంపై రాధికా గుప్తా విద్యార్థులతో సంభాషించారు. మీ ప్రిపరేషన్ కోసం మాక్ టెస్ట్ లను రూపొందించుకోవడానికి AIని ఉపయోగించకొవచ్చని తద్వారా సమయం ఆదా చేసుకోవచ్చని రాధికా గుప్తా వివరిస్తూ…

(వాయిస్ 25 సెకన్లు)

=======================

విశ్వసనీయమైన సమాచారంతో పాటూ వినోదాన్ని, విజ్ఞానాన్ని రేడియో అందిస్తుందని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. ప్రపంచ రేడియో దినోత్సవాన్నిపురస్కరించుకొని ఈరోజు ఆయన న్యూఢిల్లీలో “రేడియో ఫెస్టివల్-2025”ను ప్రారంభించారు. ప్రపంచంలోని అతిపెద్ద ప్రసార సంస్థలలో ఆకాశవాణి ఒకటని, దేశ జనాభాలో 98 శాతం మందికి ప్రస్తుతం చేరుతుందని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. అలాగే ఆకాశవాణి డైరెక్టర్ జనరల్ డాక్టర్ ప్రగ్యా పలివాల్ గౌర్ మాట్లాడుతూ… వాతావరణ మార్పుల గురించి ప్రజల్లో అవగాహన కల్పించడానికి ఆకాశవాణి ఎల్లప్పుడూ కట్టుబడి ఉందన్నారు.

=======================

జాతీయ పెన్షన్ పథకాలన్నింటిని ఒకే పరిధి కిందకు తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తోందని కేంద్ర కార్మిక శాఖా మంత్రి మన్సుఖ్ మాండవీయ తెలిపారు. రాజ్యసభలో ఈరోజు ఆయన ప్రశ్నోత్తరాల సమయంలో సమాధానమిస్తూ… ముఖ్యంగా అసంఘటిత రంగాల వారికి అనేక పెన్షన్ పథకాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఈ పథకాలలో అటల్ పెన్షన్ యోజన, పిఎం శ్రామిక్ మంథన్, పిఎం శ్రమ యోగి మంథన్ ఉన్నాయని అన్ని జాతీయ పెన్షన్ పథకాలను సరళీకృతం చేయడం ద్వారా వాటిని పరిధి కిందకు తీసుకురావాలని ప్రభుత్వం ఆలోచిస్తోందని కేంద్రమంత్రి వివరించారు.

=======================

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సూచనల మేరకు మహాకుంభమేలా గురించి అసత్య వార్తలను తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్న సామాజిక మాధ్యమాల ఖాతాలను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటున్నామని పోలీస్ డైరెక్టర్ జనరల్ ప్రశాంత్ కుమార్ తెలిపారు. పోలీసుల ప్రతిష్టను దెబ్బతీసేందుకు, సమాజంలో ద్వేషాన్ని వ్యాప్తి చేయడానికి ప్రయత్నిస్తున్నవారిని ఉత్తరప్రదేశ్ పోలీసులు తమ సోషల్ మీడియా పర్యవేక్షణలో భాగంగా గుర్తించారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

=======================
=======================